# మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్

***Mr. Raghothama Rao***

బాల కోటేశ్వర రావు ఉరఫ్ బాలు పదో తరగతి చదువుతున్నాడు. కానీ అలా అనిపించడు. మూడడుగుల ఎత్తుతో కేవలం ఇరవై రెండు కేజీల బరువుతో అప్పుడే పుట్టినవాళ్ళకు అన్న లాగా అంతలోనే పెరిగేవాళ్ళకు తమ్ముడిలాగా అగుపడతాడు. అతని పొడుగాటి మిత్రులంతా 'బుడ్డోడా' అని పిలుస్తుంటారు. ఇలాంటి పిలుపులకంతా బాలు ఏమాత్రం బాధపడడు. పైగా సరదాగా తీసుకుంటాడు. ఇలాంటి లక్షణాలు క్లాసు మొత్తం మీద తనకొక్కడికే ఉండి అందరిలోనూ ప్రత్యేక గుర్తింపు ఉన్నందుకు సంతోషపడుతుంటాడు. కేవలం అతనే కాదు అతని తండ్రి కూడా తెగ ఆనందపడుతుంటాడు. సమస్త భారత పౌరులందరిలానే బాలు తండ్రికి కూడా ముదిరిపోయిన క్రికెట్ పిచ్చి ఉంది. లిటిల్ మాస్టర్ , మాస్టర్ బ్లాస్టర్లలా తన ద్వితీయ పుత్ర రత్నం కూడా సమీప భవిష్యత్తులో లిటిల్ ఛాంపియన్ తప్పక అవుతాడని ఆయన ప్రగాఢ విశ్వాసం .

ఆయన విశ్వాసానికి మరో ముఖ్య కారణం ఉంది. అది ప్రస్తుత భారతపౌరుడు (ఓటు హక్కు వచ్చేసి భావి భారత పౌరుడి స్థాయిని దాటేసాడు), తన పెద్ద కొడుకు (ఇప్పుడిప్పుడే స్వతంత్రంగా గడ్డం గీసుకుంటున్నాడు) కేవలం నాలుగడుగుల ఒక్క అంగుళం పొడవుగల బాల నాగేశ్వర రావు ఉరఫ్ నాగూ తన కాలేజ్ టీం లో పన్నెండో నెంబరు ఆటగాడిగా స్థానం సంపాదించడం.

బాలూకి ఆటలపై పెద్ద ఆసక్తి లేదు. అంతో ఇంతో ఉంటే అది క్రికెట్ మీదే. కానీ అతను క్రికెట్ ఆడ్డానికన్నా చూడడానికే ఇష్టపడతాడు. ఇదే బాలు తండ్రికి అతనితో వచ్చిన చిక్కు. బాలుని క్రికెట్ ఆడడానికి ఎంత ప్రోత్సహించినా ఏదో ఒక సాకు చెప్పి తప్పించుకుపోతాడు. ఐనా బాలు తండ్రి పట్టు వదలని విక్రమార్కుడి పితామహుడిలా ప్రయత్నాలు సాగిస్తూనే ఉన్నాడు. ఇలాంటి పరిస్థితులలో అతనికో అనుకోని అవకాశం వచ్చింది.

ఆ ఊళ్ళోనే కొత్తగా స్థాపించబడ్డ ఓ స్పోర్ట్స్ కల్చరల్ క్లబ్ వారు విద్యార్థులలో సంఘీభావం , ఐకమత్యం పెంపొందించే ఉద్దేశ్యంతో హైస్కూల్ స్థాయిలో ఏదైనా ఒక ఆటలో పోటీలు నిర్వహించాలని సంకల్పించారు. ఏ ఆటను నిర్వహించాలని సభ్యుల మధ్య చర్చ వచ్చినప్పుడు ఓటింగ్ తో నిమిత్తం లేకుండానే క్రికెట్ ఆట ఎంపికయింది. వెంటనే టీములకై స్కూళ్ళకు విజ్ఞప్తులు పంపడం , ప్రేక్షకులిగా వచ్చి వీక్షించి ప్రోత్సహించాల్సిందిగా ప్రజలకు కరపత్రాలు పంచడం జరిగింది.

బాలు తండ్రి అతన్ని సెలెక్షన్స్ లో పాల్గొనమని ఆదేశించాడు. అందుకు బాలు నసిగాడు కానీ తండ్రి కళ్ళలోని ఎర్రని జీరలు అతన్ని భయపెట్టాయి. ఇష్టం లేని పని చేయక తప్పిందికాదు. దాంతో బాలు సెలెక్షన్స్ లో ప్రతిరంగం లోనూ తన శక్తిమేరకు డిస్ క్వాలిఫై కావడానికి ప్రయత్నించాడు. బౌలింగ్ , బ్యాటింగ్ ఒకటేమిటి అన్నింటిలోనూ డిస్ క్వాలిఫై

అయ్యాడు కూడా.

అన్నింటా తను చూపిన అప్రతిభ పట్ల అప్రతిభుడైన బాలు ఇక తనకేమీ భయం లేదన్న ధీమాతో నిశ్చింతగా ఉండిపోయాడు. కానీ ప్రమాదం వచ్చి పడనే పడింది. ఆ ప్రమాదకారి, బాలూ విషాదకారి ఎవరో కాదు....అతని తండ్రే.

తన కుమారుడు కావాలనే డిస్ క్వాలిఫై అయ్యాడని గ్రహించిన ఆ విక్రమార్క పితామహుడు ఎమ్మార్వో ఆఫీసులో హెడ్ క్లర్క్ అన్న తన స్థాన మహిమతో, సెలెక్షన్స్ నిర్వహించిన డ్రిల్ మాష్టారి కుమారుడికి కావలసిన తప్పుడు నేటివిటీ సర్టిఫికేట్ ను ఇప్పించడం అన్న ఓ 'పొలిటికల్ సమ్మోహన బ్రహ్మాస్త్రా'న్ని ప్రయోగించి మాష్టారుతో 'కత్తు కలిపేసి' తన కుమారుడికి స్కూల్ టీం ఫైనల్ లిస్ట్ లో స్థానం సంపాదించేసాడు.

ఈ కుయుక్తులేవీ ఎరుగని బాలు తాను యథాలాపంగా చూసిన క్రికెట్ టీం లిస్ట్ లో తన పేరుండడం చూసి మొదట ఉలిక్కిపడి, పిదప భయపడి, తరువాత దాదాపు మూర్ఛపోయాడు. తనపై ఇంత కుట్ర చేసింది ఎవరా అని ఘోరంగా ఆలోచించాడు. భలేగా శాపనార్థాలు పెట్టాడు. అసలు తనలో ఏం చూసి సెలెక్ట్ చేసారోనని తెగబోల్డు ఆశ్చర్యపడుతూ దీక్షగా మరోసారి లిస్ట్ కేసి చూసాడు. తన పేరు అందరి కంటే చివరగా చాలా క్రింద పన్నెండో నెంబరులో ఉండడం చూసి ఊరటతో నిట్టూర్చి విషాదం తో వెనుదిరిగాడు.

ఇంతలో పోటీలను నిర్వహిస్తున్న క్లబ్ వారు మరో కొత్త నిబంధన విధించారు. విద్యార్థులను మైదానం బైటనే కాక మైదానం లోపల కూడా క్రమశిక్షణతో ఉంచడానికి మరియు వారి నాయకత్వ బాధ్యతను వహించడానికిగాను ప్రతి టీములోనూ ఒక టీచర్ తప్పనిసరిగా ఉండాలని ఆ నిబంధన సారాంశం . దీంతో డ్రిల్ మాస్టర్ కోచ్ కం కేప్టన్ గా, స్కూల్ ప్యూపిల్స్ లీడరైన రషీద్ వైస్ కేప్టన్ కం వికెట్ కీపర్ గా బాలు రిజర్వుడ్ ప్లేయర్ గా టీం తయారై రోజువారీ ప్రాక్టీస్ ప్రారంభమైంది. దీంతోనే అసలు కథ ఆరంభమైంది.

అది పోటీలలోని నాలుగో రోజు. ఆరోజు బాలుకు చాల భయంగాను, చాలా చాలా ఆందోళనగా, చాలా చాలా చాలా నీరసంగాను ఉంది. మొదటి రెండు మ్యాచుల్లో బాలు టీం ఒకటి గెల్చి ఒకటి ఓడిపోయింది. వారు క్వార్టర్ ఫైనల్స్ కు వెళ్ళాలంటే ఈ మ్యాచ్ తప్పనిసరిగా గెలవాలి. కానీ బాలు భయానికి అసలు కారణం ఈ గెలుపు సమస్య కాదు. అతని అసలు సమస్య అతను ఈరోజు పన్నెండో నెంబర్ ఆటగాడు కాకపోవడం . మ్యాచ్ ఆడాల్సిన పదకొండుమందిలో అతనూ ఒకడు. మొదటి రెండు మ్యాచుల్లో ఆడిన ఫాస్ట్ బౌలర్ మల్లికార్జున్ రెండో మ్యాచ్ లో గాయపడడంతో బాలు టీములోకి వచ్చాడు.

ఆ సంఘటన బాలుకు బాగా గుర్తుంది. ఎదుటి జట్టు బ్యాట్స్ మాన్ కొట్టిన బంతి ఫీల్డింగ్ చేస్తున్న మల్లికార్జున్ కుడిదవడకు తగలడం .... ఓ పన్ను రాలిపోవడం .... బొటబొటా రక్తం కారడం .... హమ్మోయ్ !! బాలుకు పారిపోవాలనిపిస్తోంది.

అంతేకాదు ఈరోజు తను కూడా ఆడాలన్న దుర్వార్త విన్నప్పటి నుండి బాలుకి తనను ఎవరో వేగంగా విసిరేస్తున్నట్టు, మరెవరో లాగిపెట్టి కొడుతున్నట్టు, ఇంకెవరో రెండు చేతుల్తో గట్టిగా పట్టుకున్నట్టు, తను గాల్లో గిరికీలు కొడుతూ వేగంగా కిందపడుతున్నట్టు అనిపిస్తోంది.

టాస్ వేయడానికి డ్రిల్ మాస్టారు గ్రౌండ్ లోకెళ్ళాడు. మిగతా టీం సభ్యులు ఎవరికివారు సన్నాహాలు చేసుకుంటున్నారు.

'సమయం చూసుకుని పారిపోతే?' అనుకున్నాడు బాలు. 'పారిపోవచ్చుగాని ఆ తరువాత ఏమైనా ఉందా? ఆ మల్లిగాడికి ఒక పన్నే రాలిపోయింది. తనకు అన్ని పళ్ళూ రాలిపోతాయి. తన తండ్రి, డ్రిల్ మాస్టారు చెరీ సగం పంచుకుని మరీ రాలగొడతారు. అప్పుడు అన్ని పళ్ళూ రాలిపోయిన తనని చూసి మల్లిగాడు కూడా నవ్వుతాడు. ఇది తన పరువుకు, పన్నుకు సంబంధించిన సమస్య'. ఏం చెయ్యాలో బాలు అర్థం కావడం లేదు. పోనీ ఎలాగోలా ధైర్యం తెచ్చుకుని ఆడదామంటే ఆ ధైర్యం కాస్త అవతలివాళ్ళను చూడగానే జావగారి పోతోంది.

పొద్దున్నే తను వాళ్ళను చూసాడు. ఆ టీములో ప్రతి ఒకడూ పొడవుగా, బలంగా, ఆకలిగా ఉన్నాడు. వాళ్ళల్లో మరొహడైతే ఒకేసారి ఆరడుగుల ఎత్తుతో భీకరంగా ఉన్నాడు. బాలుకు వాడు, వాళ్ళూరులోని టీవీ టవరు ఒక్కలాగా కనబడ్డాయి. మాస్టారు వాడిని 'కబంధుడు' అని పిలవడం విన్నాడు. కబంధుడంటే పొడవాటి చేతులున్న ఒంటికన్ను రాక్షసుడు కదూ! వీడు రెండుకళ్ళున్న రాక్షసుడు. ఈ టీము ఆడిన అన్ని మ్యాచులనూ గెలిచారంట.

అంతుపొంతు లేకుండా సాగిపోతున్నాయి బాలూ ఆలోచనలు. టాస్ ఓడిపోయాం బ్యాటింగ్ చేయాలని ప్రకటించాడు డ్రిల్ మాస్టారు. బాలు కొద్దిగా తెరిపిడి పడ్డాడు. తన పళ్ళు మరో రెండు మూడు గంటల పాటైనా భద్రంగా ఉండబోతున్నందుకు భయం భయంగానే నవ్వుకున్నాడు. ఓపెనర్స్ గా మాస్టారు, రషీద్ వెళ్ళారు. వాళ్ళ వైపు బౌలింగ్ కబంధుడు ప్రారంభించాడు.

ఆట మొదలైంది.

మొదటి బంతి మాస్టారి తల వెంట్రుకల్ని రాసుకుంటూ వెళ్ళింది. దాంతో మాస్టారి ఒళ్ళు ఒక్కసారి జలదరించింది. రెండో బంతి ఎడమ చెయ్యి ముంజేతికి బలంగా తాకింది. బాలు ఆ దెబ్బలు తనకి తగిలినట్టు వణికిపోసాగాడు. చివరి బంతికి మాస్టారు పరుగు తీయడంతో స్కోరు కదలడం ప్రారంభించింది. తరువాత మూడు ఓవర్లకి జట్టు స్కోరు పదికి చేరుకుంది. కానీ రషీద్ ఔటయ్యాడు. దాంతో వికెట్ల పతనం ప్రారంభమైంది.

ఇరవైనాలుగో ఓవరు చివరి బంతికి మాధవరావు ఔటవ్వడం తో తొమ్మిదో వికెట్ పడింది. దాంతో బాలూ గుండెలో రాయి పడింది. ఇప్పుడు తను వెళ్ళాలి. అవతలి వైపు కబంధుడు చివరి ఓవర్ వేయడానికి సిద్ధమవుతున్నాడు.

బాలు వేసుకున్న గ్లౌవ్స్ , కట్టుకున్న ప్యాడ్లు అన్నీ వదులుగా, భారంగా ఉన్నాయి. బ్యాట్ ను ఈడుస్తూ గ్రౌండ్ లోకి వస్తున్న బాలూను చూసి అందరూ నవ్వుతున్నారు. ప్రత్యర్థి జట్టు వాళ్ళైతే గట్టిగానే నవ్వుతున్నారు. బాలు బలిపశువులాగా వెళ్ళి గార్డ్ తీసుకున్నాడు.

కబంధుడు పరుగెట్టడం ప్రారంభించాడు. క్రీజ్ లోకి వచ్చి రెండడుగులు గాల్లోకెగిరి, మెరుపు వేగం తో కుడి చెయ్యి తిప్పాడు. బంతి బాలు చెవి పక్కగా వెళ్ళింది. బాలూ కళ్ళు భయంతో పెద్దవయ్యాయి. బంతి దూసుకెళ్ళిన శబ్దం అతని చెవిలో గుయ్ మంటోంది. ఇంతలో రెండో బంతి దూసుకు రాసాగింది. అది ఇంతకు ముందు దానిలా ఎత్తుగా కాక నేలబారుగా తన కాళ్ళ కేసి వస్తోందని గ్రహించిన బాలు భయం తో కళ్ళు మూసి కంగారుగా బ్యాట్ ను అడ్డంగా ఊపాడు. తగిలింది. బంతి బ్యాట్ కు తగిలింది. ఆ తాకిడికి బాలు శరీరం మొత్తం వణికింది. 'రన్ ... బాలూ ... రన్ ' అన్న మాస్టారి కేకతో కళ్ళు తెరచి పరుగెట్టడం మొదలెట్టాడు. అవతలి క్రీజ్ చేరుకుని ఊపిరి పీల్చుకున్నాడు. మిగిలిన నాలుగు బంతుల్ని మాస్టారు ఆడడం తో వాళ్ళ ఇన్నింగ్స్ ముగిసింది. మొత్తం స్కోర్ ఇరవై ఐదు ఓవర్లలో తొమ్మిది వికెట్ల నష్టానికి డెబ్భై పరుగులు.

బాలూ జట్టు ఫీల్డింగ్ వచ్చే సమయానికి మాస్టారుకు ఓ గట్టి చిక్కు సమస్య వచ్చిపడింది ... బాలూ రూపం లో. పీలగా, బలహీనంగా ఉన్న బాలూను ఏ ఫీల్డింగ్ ప్లేస్ లో ఉంచాలో అర్థం కావడం లేదు.

మిడాన్ - నో
మిడాఫ్ - నో నో
మిడ్ వికెట్ - నో్న నో్న నో్న
గల్లీ - అమ్మో అది జడేజా, యువరాజ్ లాంటి వారి కోసం
పోనీ స్లిప్స్ - ఛ చచ్చు ఆలోచన అది ఏ అజరుద్దీన్ , లక్ష్మణ్ లాంటి వారి కోసం
లాంగాన్ - నో
సిల్లీ పాయింట్ - నో

'ఆహ్! హెల్ విత్ దిస్ లిటిల్ మ్యాన్ ' బాలూను జట్టులో తీసుకున్నందుకు మొదటిసారిగా బాధపడ్డాడు మాస్టారు. ఏ ఫీల్డింగ్ ప్లేస్ బాలూ శరీర తత్వానికి సరిపోవడం లేదు. 'హెల్ విత్ దిస్ లిటిల్ మ్యాన్ ... మ్యాన్ ...మ్యా.... న్ '

'ఎస్ థర్డ్ మ్యాన్ '

ఎదుటిజట్టులో బంతిని నేరుగానో, పక్కలకో బలంగా బాదేవారేగానీ సొగసుగా స్నిక్ చేసేవారు, లేట్ కట్స్ కొట్టగల మొనగాళ్ళు ఎవరూ లేరు. ఆ ఆలోచన రాగానే డ్రిల్ మాస్టారు మనసు తేలికపడింది. సో, బాలూ ద లిటిల్ మ్యాన్ ఈజ్ ఎట్ థర్డ్ మ్యాన్ . ఇది బాలూకు కూడా కాస్త ఊరటనిచ్చింది. ఎక్కడో బ్యాట్స్ మెన్ కి దూరంగా .... వికెట్ కీపర్ కు వెనకాల...బంతులు దూసుకురావు...పళ్ళు విరగవు..ఎవ్వరూ నవ్వరు. ఆ ఊరటకు నవ్వుకున్నాడు బాలు. కొద్దిగానే నవ్వుకున్నాడని అనిపించి మళ్ళీ నవ్వుకున్నాడు.

ఊహించినట్టుగానే కబంధుడు ఓపెనర్ గా దిగాడు.

ఆ జట్టుకు సమస్తం వాడే లాగుంది. ఓపెనింగ్ బౌలర్ , ఓపెనింగ్ బాట్స్ మ్యాన్ , బెస్ట్ ఫీల్డర్ అన్నీ వాడే. ఆ జట్టుకు సృష్టి, స్థితి, లయకారకుడు వాడే.

డ్రిల్ మాస్టార్ బుర్ర చురుగ్గా పనిచేయడం మొదలు పెట్టింది. 'ఈ తాటిచెట్టును నరికేసామంటే...!!!'. తన ఆలోచనను అమలులో పెట్టడానికిగాను తన జట్టు ప్రధాన బౌలర్లయిన మాధవరావ్ , మెహబూబ్ , ప్రభాకర్ , చక్రవర్తులతో ఓ చిన్నపాటి సమాలోచన జరిపాడు. అందరూ తమ ప్రధాన లక్ష్యం కబంధుడేనని నిశ్చయించుకున్నారు. ఆట ఆరంభమయింది. కబంధుడు అందరి అంచనాలను మించిపోయి చెలరేగిపోతున్నాడు.

మాంచి పొడుగుండడం వల్ల పొట్టివాళ్ళైన బౌలర్ల బంతుల్ని చులాగ్గా అందిపుచ్చుకుని ఎడాపెడా వాయించడం మొదలెట్టాడు. తన ప్రధాన బౌలర్లందరిని కబంధుడు మట్టికరిపించడం తో మాస్టారు నిశ్చేష్టుడైపోయాడు. బౌలర్లైతే ఈ బాల్ ను ఫోర్ పోనివ్వకుండా చూడు అని వారి వారి ఇష్టదైవాలను ప్రార్థించుకోసాగారు. అప్పటికి పన్నెండు ఓవర్లు మాత్రమే పూర్తయ్యాయి. కబంధుడి జట్టు స్కోర్ అప్పుడే యాభైకు చేరింది. వికెట్లేమో నాలుగు పడ్డా కబంధుడు ఇంకా మిగిలుండడం మాస్టార్ని చికాకు పరుస్తోంది. తనతో సహా అందరు బౌలర్లు తాము అనుకున్నది సాధించడం లో విఫలం కావడంతో తరువాతి ఓవర్ ఎవరికివ్వాలో అర్థం కాలేదు మాస్టారికి. నిరాశగా దిక్కులు చూస్తున్న మాస్టారుకి దూరంగా, ఎక్కడో చూస్తూ, గోళ్ళు కొరుక్కుంటూ నిలబడ్డ లిటిల్ మ్యాన్ ఎట్ థర్డ్ మ్యాన్ బాలూ కనబడ్డాడు. మరుక్షణం లో మాస్టారి మొహం లో ఏదో విచిత్రమైన భావం వింతగా కదలాడింది. ఎందుకో తెలీదుకానీ మాస్టారుకి ఆ క్షణం లో బాలూ విభీషణుడిలా అగుపించాడు. రావణాసురుడి (కబంధుడి) అమృతభాండాన్ని (వికెట్ ను) కొల్లగొట్టేందుకు వీడే సరైన సాధనం . తన జీవితచరిత్రలో చిరస్థాయిలోనైనా నిలబడిపోయే అపూర్వ ప్రయోగం ... బ్రహ్మరాక్షసుడిపై పిచ్చుకాస్త్ర ప్రయోగం .

'బాలూ...బా...లూ...' గట్టిగా అరిచాడు మాస్టారు. ఏదో లోకం లో తేలుతున్న బాలు నిజంగానే భయపడ్డాడు. ఖర్మగానీ కాలి బంతేమైనా తన వైపుకొచ్చేస్తోందో ఏమో నని కంగారుగా గుండ్రంగా తిరిగి బంతి కోసం వెతకసాగాడు. 'బాలూ...ఇలా రా' గర్జించాడు మాస్టారు. బాలూ మనసేదో కీడు శంకిస్తోంది. మాస్టారు, రషీద్ ఏదో మాట్లాడుకుంటున్నారు. రషీద్ కు తనకు పడదు. బహుశా ఇద్దరూ ఏదో కుట్ర చేస్తుండొచ్చు. భయంగానే అక్కడికెళ్ళాడు బాలు. 'కమాన్ ... బౌలింగ్ చెయ్యి !' అంటూ చేతిలోకి బంతినిచ్చాడు మాస్టారు.

ఇది నిజంగా ఘోరమూ, భీకరమూ, అనూహ్యమూ ఐన ప్రమాదము. ఘన ఘోర శిక్ష. 'లవకుశ' సినిమాలోలా తన కాళ్ళ కిందున్న భూమి చీలిపోయి తను లోపలికెళ్ళిపోతేనన్నా బావుండును. కానీ పద్యమే గుర్తురావడం లేదు 'ఓ తల్లీ ! ఓ భూమీ !!'. కరక్టేనా???

'కమాన్ బాలూ బౌలింగ్ చెయ్ . లేటవుతోంది'

ఖంగు మంటూ మోగింది కటువైన మాస్టారి గొంతు.

బాలు ఒక్కసారి కబంధుడి కేసి చూసాడు. వాడి మొహం లో పిచ్చి ఆనందం కనబడింది. ఇప్పటి దాకా వాడు పొందిన మజా వాడిని మరింతగా రెచ్చగొడుతోంది. ‘నీకంటే పొడుగాటి వాళ్ళ బంతుల్నే చీల్చి చెండాడాను నువ్వెంతరా బుడం కాయ్ ’అన్నట్టుగా ఉంది వాడి చూపు. ‘కమాన్ బాలూ కమాన్ ’ వికెట్ల వెనకనుండి గట్టిగా అరిచాడు రషీద్ . బాలూ ముందుకు కదిలాడు. కుడిచేతిని గుండ్రంగా తిప్పి బంతిని వదిలాడు.

వస్తున్న బంతిని చూసి కబంధుడు ఆశ్చర్యపోయాడు. బాలు వేసిన బంతి ఎక్కడో పిచ్ పడి మరెక్కడికో దొర్లుకుపోతోంది. వేగంగా వచ్చే బంతుల్ని, సుడులు తిరుగుతూ లేచే బంతుల్ని మాత్రమే హేండిల్ చేయడానికి అలవాటుపడ్డ కబంధుడు ఇలా బద్ధకంగా, నీరసంగా మరీ అన్యాయంగా దొర్లుతూ వస్తున్న బంతిని చూసి ఆశ్చర్యభరిత ఆందోళనకి గురయ్యాడు. అలా సగం గెంతుతూ, సగం దొర్లుతూ వచ్చే బంతుల్ని ఇంగ్లీషులో ఏమంటారో గానీ స్థానిక క్రికెట్ పారిభాషిక పదజాలం మేరకు ‘బుస్ పాము’ అంటారు.

తికమకపాలైన కబంధుడు కొద్దిగా తేరుకొని తన కాళ్ళ దగ్గరకు దొర్లుకొస్తున్న ‘బుస్ పాము’ను బ్యాట్ అనే నాదస్వరం తో కట్టివేయడానికి ప్రయత్నించి కించిత్ సఫలుడయ్యాడు. వ్యూహనిపుణుడైన మాస్టారు తన ప్రయోగ ఫలింతంగా కబంధుడి మొహం కలవరపాటుకు గురికావడం గమనించి పొంగిపోయాడు. ‘గుడ్ బౌలింగ్ బాలూ ... గుడ్ బౌలింగ్ ’గట్టిగా చప్పట్లు కొడుతూ అరిచాడు మాస్టారు. బాలు వేసిన బంతికే చిందరవందరుడైన కబంధుడు, ఆ బౌలింగును మాస్టారు పొగడడం తో గందరగోళుడైనాడు.

రషీద్ బాలుకు బంతినందిస్తూ ‘వాడి ఎడం వైపుకు వెయ్యి’ అని చెవిలో గుసగుసలాడాడు. స్కూల్ ప్యూపిల్స్ లీడర్ తన భుజం పై చేయి వేసి గుసగుసలాడిన క్షణం బాలుకు చాలా గర్వంగా అనిపించింది. దాంతో బాలూలో భయం పోయి ఉత్సాహం చోటు చేసుకుంది. ఈసారి బాలు మరింత శ్రద్ధతో, బలం తో కబంధుడి ఎడమ వైపుకు విసిరాడు. శ్రద్ధ, బలం అవసరమైన దానికంటే ఎక్కువ కావడం తో బంతి ఎడం వైపు మరింత ఎడంగాపోయింది. అంపైర్ ‘వైడ్ ’అన్నాడు.

కబంధుడు బాలూ ఇచ్చిన షాక్ నుండి ఇంకా తేరుకోలేదు. వాడికి బాలు వేస్తున్న బౌలింగ్ ఏ రకానికి సంబంధించిందో అర్థం కావడం లేదు. మూడో బంతి వేయడానికి తన శక్తినంతా కూడదీసుకున్నాడు బాలు. మొదటి రెండు బంతులకే అతని భుజం లాగడం. చేతి వేళ్ళు నెప్పివేయడం మొదలయ్యింది. పళ్ళను బిగబట్టి, శ్వాసను ఎగగట్టి పూర్తి బలం కొద్దీ బంతిని విసిరాడు.

ఓహ్! బాలు విసిరిన బంతి అలా గాల్లో లేచింది. అది నేరుగా...మరింత నేరుగా ప్రయాణించి ఉన్నట్టుండి కిందకు దిగి కబంధుడి బ్యాట్ కు పాడ్ కు మధ్య గల ఖాళీ కేసి దూసుకు రాసాగింది. అందరూ ఆశ్చర్యపోయారు.

ఎస్ ఇట్స్ ఏ పర్ఫెక్ట్ యార్కర్.

మరో బుస్ పాము వస్తుందన్న ఊహలో ఉన్న కబంధుడు ఈ హఠాత్పరిణామానికి బిత్తరపోయాడు. వెంటనే తనేం చెయ్యాలో అతను తెలుసుకున్నాడు. కానీ అప్పటికే ఒక్క సెకను ఆలస్యమైంది. ఆ సెకన్ లో యాభైయ్యో వంతులో బంతి వెళ్ళి లెగ్ స్టంప్ ను సున్నితంగా తాకడం , బెయిల్ సుతారంగా కిందపడడం జరిగిపోయింది. ఆ జరిగిందేమిటో అర్ధమవడానికి అందరికీ ఐదు సెకన్ల సమయం పట్టింది. ఆ ఐదు సెకన్ల అత్యంత ఆశ్చర్యకర, నిరామయ, నిరాధార, నిర్వికార విరామం తరువాత గ్రౌండంతా రకరకాల కేకలతో నిండిపోయింది.

బాలూ నిజంగానే ఆశ్చర్యపోయాడు. మాస్టారు ఆనందం ఎక్కువై మాటరాక, కాలు కదలక తన స్థానం నుండి కదల్లేకపోయాడు, రషీద్ చెయ్యెత్తి 'ఔట్ ఔట్ ' అంటూ అదేపనిగా అరుస్తున్నాడు. గ్రౌండ్ నలుమూలలున్న ఫీల్డర్లు పరుగెత్తుకు రాసాగారు. వీటన్నింటిని మించి కబంధుడు వెనక్కి తిరిగి పడిపోయిన బెయిల్ వంక చూస్తూ ఉండిపోయాడు.

ఆ ఓవర్ తరువాత మళ్ళీ బాలు బౌలింగ్ చెయ్యాల్సిన అవసరం రాలేదు. అవసరం లేదు కూడా ! మాస్టారు తనకిష్టమైన లెగ్ బ్రేకులతోను, ప్రభాకర్ తన పదునైన గుగ్లీలతోను, మాధవరావ్ తన స్లో బాల్స్ తోను, మెహబూబ్ తన ఔట్ స్వింగర్లతోనూ మిగిలిన వారిని హడలుగొట్టి అరవై ఎనిమిది పరుగులకు వారిని ఆలౌట్ చేసారు. బాలు జట్టు రెండు పరుగుల తేడాతో కీలకమైన మ్యాచ్ గెలిచి క్వార్టర్ ఫైనల్స్ లో అడుగుపెట్టింది.

ముప్పై రెండు పరుగుల నాటౌట్ ఇన్నింగ్స్ తో బాటు రెండు వికెట్లు తీసుకుని, మూడు క్యాచ్ లు పట్టిన మాస్టారు ఆనాటి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ గా ప్రకటించబడ్డాడు. కానీ అతనికి తెలుసు అసలు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ ఎవరని !!



" You always use lighter?"
" Yah, because all the Matches are over "


" I just match Brides and Grooms and fix marriages , Sir "
" So it's a case of Match Fixing "